క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

కొందుర్గు: మండలంలోని మహదేవ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో పది సంవత్సరాలుగా పనిచేసిన ఉపాధ్యాయురాలు శ్యామల బదిలీపై వెళ్లడంతో పాఠశాల ఆధ్వర్యంలో స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై ఉపాధ్యాయురాలిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రజిత, మాజీ సర్పంచ్‌లు రాజారామేశ్వర్‌రెడ్డి, రామచంద్రయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథం వద్ద స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఉదయం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కొమరబండ గ్రామం నుంచి బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం వరకు భక్తులు భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ కోలాహలంగా పాటలు పాడుకుంటూ రథోత్సవంలో పాల్గొన్నారు. మరో మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, కమిటీ సభ్యులు సత్యనారాయణ, సునిత, రాణి, గ్రామస్తులతో పాటు మండల ప్రజలు భారీగా పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న బాబయ్య

కేశంపేట: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. మండల పరిధిలోని లింగంధన గ్రామంలో లింగంధన, తొమ్మిదిరేకుల, నిర్దవెల్లి గ్రామాలస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో రొల్లు రఘురాంగౌడ్, నర్సింహ, యుగేందర్, శేఖర్, వెంకటేశ్వర్, శివచారి, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొందుర్గు: ఆదిలాబాద్‌లో ఏప్రిల్ 14న ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రారంభించనున్న మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ సూచించారు. శుక్రవారం కొందుర్గులో మా భూమి రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యస్థాపనకు చేపడుతున్న లక్ష కిలోమీటర్ల రథయాత్రకు అందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిచరణ్, రాములు, శివ, వెంకటేశ్, కృష్ణయ్య, నవీన్, మహేశ్ పాల్గొన్నారు.



వర్షపునీటిలో నుంచి ఇబ్బంది పడుతూ వెళ్తున్న వాహనదారులు, ప్రజలు



ప్రభుత్వ పాఠశాల ఎదుట నిలిచిన వర్షపునీరు

వర్షపు నీటికి దారేది?

- నీరు నిలవడంతో కుంటలను తలపిస్తున్న రోడ్లు
- ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చేవెళ్ల: రోడ్లు వేస్తున్నారని సంతోషపడుతుంటే వర్షపునీరు పోయేందుకు దారిలేక రోడ్లపైనే వంపు ఉన్నచోట నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల రోడ్లపై వర్షపునీరు పోయేందుకు దారిలేక చెరువులను తలపించేలా రోడ్లపైనే నీళ్లు నిలిచాయి. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం తల్లిదండ్రులు పిల్లలను ఈ వరదనీటిలోనుంచే జాగ్రత్తగా దాటిస్తూ కనిపించారు. చేవెళ్లలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు పాఠశాల గేట్ ముందే నిలిచి కుంటలా మారింది. విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేసుకుంటూ పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ రోడ్డుపై నుంచి వర్షపునీరు భగత్ సింగ్ కాలనీ, వెంకటరమణ కాలనీల్లోని రోడ్లపై పారుతూ ఎక్కడ గుంతలు ఉంటే అక్కడ ఆగుతూ కుంటలా మారుతున్నాయి. అధికారులు రోడ్లు వేస్తున్నారే కానీ ఈ వర్షపు నీరు పోయేందుకు కావాల్సిన దారి ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాగే ఉంటే పట్టణ కేంద్రంలో వర్షాకాలంలో మరింత ఇబ్బంది ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు. చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను ఈ విషయంపై అడిగితే ఇంకా ఎలాంటి నిధులు కొత్త మున్సిపాలిటీకి రాలేదు. ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెబుతున్నారు.

వరదనీరు పోయేలా చేయాలి



వర్షం పడితే పట్టణ కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై నుంచి వరదనీరు అంతా గ్రామంలోకి ఉన్న దారులపైకే వస్తుంది. ఈ వర్షపునీరు పోయేందుకు సరైన మార్గాలు లేక రోడ్లపై ఎక్కడ వంపు ఉంటే అక్కడికి చేరుతున్నాయి. చెరువులుగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపు డ్రైనేజీ లైన్‌లు వేసి వరదనీరు పోయేలా చేయాలి. లేదంటే రోడ్డుకు లోతులో ఉన్న ఇళ్లు వర్షాకాలంలో నీటిలో మునుగుతాయి. – కృష్ణ, గ్రామస్తుడు, చేవెళ్ల

సీసీరోడ్డుకే నిధులు వచ్చాయి

పట్టణ కేంద్రంలోని జిల్లా మైనింగ్ నిధుల నుంచి రూ.30లక్షల నిధులతో సీసీరోడ్డు పనులు జరుగుతున్నాయి. గతంలో ఒక కోటి రూపాయలతో సగం సీసీరోడ్డు వేశామని మిగిలిన సీసీరోడ్డును ఈ నిధులతో వేస్తున్నాం. అయితే సైడ్‌డ్రైన్స్‌లు ఇందులో లేవు. సీసీరోడ్డు మాత్రమే ఉంది. రోడ్డుపక్కన గతంలో ఉన్న డ్రైన్‌లోకే వర్షపునీరు పోయేలా చేసుకోవాలి. – ప్రభాకర్, పీఆర్‌ఏఈ, చేవెళ్ల

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



తాళ్లపల్లిలో బియ్యం పంపిణీ చేస్తున్న భీంభరత్ తదితరులు

చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లపల్లి, కేశవగూడ గ్రామాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందని, పేదల ఆకలి తీర్చేందుకు కృషి చేస్తోందన్నారు. పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికల్లో మద్దతిచ్చి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి మాట్లాడుతూ.. పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతోనే సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించామని, ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మద్దుల రమేశ్‌పంతులు, మాజీ సర్పంచ్‌లు పెంటయ్య, మహేందర్‌గౌడ్, సత్యం, డీలర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, చేవెళ్ల నియోజకవర్గ ఏబ్లాక్ వైస్ ప్రెసిడెంట్ పల్లాటి అశ్విని, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింలు, చెన్నయ్య, మండల మహిళా అధ్యక్షురాలు స్వరూప తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బందోబస్తు

సీఐ విజయ్‌కుమార్



ఆలయం వద్ద సీఐ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది

షాద్‌నగర్: శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సీఐ, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిఏటా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు భారీఎత్తున భక్తులు రానున్న సందర్భంగా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఇందుకుగాను ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆదివారం సాయంత్రం శ్రీరామ శోభాయాత్రను భక్తులందరూ శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌కుమార్, శిక్షణ ఎస్ఐ మాజీ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం కందివనం గ్రామ పంచాయతీ పిట్టలగడ్డ తండాలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని సన్మార్గంలో పయనించాలని సూచించారు. భక్తి భావనతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అమ్మనాయక్, యాదయ్య, శివజ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

రుణాలను సద్వినియోగం చేసుకోండి

చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్



రైతుకు చెక్కు అందజేస్తున్న అశోక్

నందిగామ: పీఏసీఎస్‌ల ద్వారా ఇచ్చే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో పీఏసీఎస్ నుంచి శుక్రవారం పలువురు రైతులకు వివిధ రకాలైన రుణాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు అన్ని రకాలైన రుణాలను అందజేస్తామన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 5 మంది రైతులకు రూ.30 లక్షల రుణాలను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, సీఈఓ వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు బహూకరణ



ధ్వజస్తంభం వద్ద దాత రాంచంద్రయ్య, కుటుంబ సభ్యులు

షాబాద్: ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దాత ఏశాల రాంచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన ఏశాల రాంచంద్రయ్య రూ.70వేల విలువ గల ధ్వజస్తంభ ఇత్తడి తొడుగు పూతను కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్, సత్యనారాయణ, అరుణ, సుగుణమ్మ, శివనీల, జయశ్రీ, పద్మమ్మ, భారతమ్మ, లావణ్య, అక్షయ తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విరిగిన స్తంభం

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో శుక్రవారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు, సిబ్బంది శుక్రవారం కొత్త స్తంభాన్ని తీసుకొచ్చి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

'రాజ్యాంగాన్ని అగౌరవపరుస్తున్న కేంద్రం'

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తిగా అగౌరవపరుస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ గ్రామంలో ఉన్న ఎన్‌హెచ్ 44 హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ గొప్పతనం, రాజ్యాంగ ఆవశ్యకతలను ప్రజలకు గ్రామ, పట్టణ స్థాయిలో వివరించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రచార ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నో త్యాగాలతో నవ భారత్‌ను నిర్మించుకున్నామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ రాచరికపాలన కొనసాగించి పూర్తిగా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. హెచ్‌సీయూ భూములపై విద్వేషాలను రెచ్చగొట్టి విద్యార్థులను బలిపశువులను చేస్తున్నారన్నారు. ఈ సంవిధాన్ కార్యక్రమానికి సంబంధించి నాయకులు ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నయ్య, తాండ్ర విశాల, విశ్వం, వెంకట్‌రాంరెడ్డి, చంద్రశేఖర్, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



లబ్ధిదారులకు యంత్ర పరికరాల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్రాలు, పనిముట్లు అందజేస్తుందన్నారు. రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, ఏఓ నిశాంత్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, నాయకులు పురుషోత్తంరెడ్డి, శ్రీధర్, నెహ్రూనాయక్, అశోక్, సీతారాం, కృష్ణ, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

బోధనకు చేయూత



సంధ్యారాణికి నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ అశోక్‌కుమార్

నందిగామ: పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు గాను ఓ విద్యావంతురాలిని నియమించి రెండునెలల జీతం అందించి ఉదారతను చాటుకున్నాడు మాజీ సర్పంచ్. మండల పరిధిలోని నర్సప్పగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 11 మంది ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశారు. ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో సబ్జెక్టులు బోధించేవారు లేకపోవడంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్ తన సొంత డబ్బుతో పాఠాలు బోధించేందుకు గాను గ్రామానికి చెందిన మెండే సంధ్యారాణిని నియమించారు. ఈ నేపథ్యంలో సంధ్యారాణికి రెండు నెలలకు గాను రూ.14వేల నగదును శుక్రవారం అందజేశారు. అశోక్‌కుమార్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ సువర్ణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదయ్య, మాజీ కురుమ సంఘం అధ్యక్షుడు జెల్ల శంకరయ్య, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీభూపాల్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంట మరమ్మతులు ప్రారంభం



చెరువు మరమ్మతులు ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

నందిగామ: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గోధుమ కుంట చెరువు మరమ్మతులకు సెట్రీస్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకొచ్చి శుక్రవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ తెలంగాణ కార్యనిర్వహణాధికారి అమర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం సెట్రీస్ సంస్థ దేశ వ్యాప్తంగా స్వచ్ఛందంగా పనిచేస్తోందన్నారు. చెరువులు, కుంటలలో నీటి సామర్థ్యాన్ని పెంచడం కోసం పూడికతీత, కట్ట సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెరువులో మరమ్మతులు చేపట్టేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఆ సంస్థను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గీ శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యులు దేవేందర్‌యాదవ్, యాదయ్య, గోపాల్‌గౌడ్, మత్స్యకార సంఘం నేతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ అనంతం

షాద్‌నగర్: వేసవికాలంలో ప్రయాణికులు, బాటసారుల దాహం తీర్చడానికి ప్రతిఏడు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని వాసవి క్లబ్ 102ఎ గవర్నర్ డాక్టర్ సరాపు అనంతం అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో వాసవి, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం అనంతం, డీఎం ఉష చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గత 15 ఏళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, మజ్జిగ, అంబలి, తాగు నీటిని అందిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులు, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన వాసవిక్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం, వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియను వారు అభినందించారు. కార్యక్రమంలో వినయసంతోషి, నవీన్‌కుమార్, గుబ్బ సురేష్, స్రవంతి, స్వప్న, వెంకటరమణ, కొండా రమ, నర్సింలు గుప్తా, శ్రీనివాస్, వాడకట్టు విజయకుమార్, ఎంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, బండారు ఆనంద్, పెద్ది విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

నేలకొరిగిన జొన్న, మొక్కజొన్న పంటలు



కేశవగూడలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

షాబాద్: మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షం కురిసింది. వర్షం, ఈదురుగాలుల కారణంగా మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో జొన్న, మొక్కజొన్న నేలకొరిగింది. షాబాద్, బొబ్బిలిగామ, హైతాబాద్, సోలీపేట్, నాగర్‌కుంట, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో సాగుచేసిన పూలతోటలు, కూరగాయలు, వరి, మామిడి తదితర పంటలు దెబ్బతిన్నాయి.